క్లుప్తంగా

పెద్దాసుపత్రి ఏఓగా శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏఓగా ఎం. శ్రీనివాసులు నియమితులయ్యారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన గత నెలలో నిర్వహించిన పదోన్నతి కౌన్సిలింగ్‌లో ఏవోగా పదోన్నతి పొందారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఏఓగా నియమించడంతో శుక్రవారం ఆయన ఆసుపత్రిలో విధుల్లో చేరారు.

ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ సహ అధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర సహఅధ్యక్షుడి (అసోషియేట్ ప్రసిడెంట్)గా వి.దస్తగిరిరెడ్డి ఎన్నికయ్యారు. ఈయన నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఎంపీహెచ్‌ఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా రాష్ట్ర సహ అధ్యక్షుడిగా ఎన్నికైన దస్తగిరి రెడ్డిని ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి,, జవహర్‌లాల్, అసోసియేట్ ప్రసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి అభినందించారు.

నేడు సీపీఐ సమావేశం

కర్నూలు(సెంట్రల్) : ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీపీఐ జనరల్ బాడీ సమావేశం శనివారం దేవీ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బజాజ్ ఆటో క్రెడిట్‌ను వినియోగించుకోండి



భారత్ బజాజ్ షోరూంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంస్థ ఎండీ వసీం

కర్నూలు (టౌన్): బజాజ్ ఆటో ఫైనాన్స్ లిమిటెడ్‌ను ఇప్పుడు బజాజ్ ఆటో క్రెడిట్‌గా మార్పు చేశారని భారత్ బజాజ్ ఎండీ. ఎస్. వసీం అన్నారు. శుక్రవారం స్థానిక బంగారు పేటలోని భారత్ బజాజ్ షోరూంలో సబ్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆటో క్రెడిట్‌గా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా షోరూంలో కేక్ కట్ చేసి మాట్లాడారు. వినియోగదారులు మరింత సులభతరంగా క్రెడిట్ అవకాశాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ చంద్రశేఖర్, సబ్ డీలర్లు రంగస్వామి, రాము, శ్రీకాంత తదితరులు పాల్గొన్నారు.

పుట్టింది ఇక్కడే..చదివింది ఇక్కడే

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు ఇన్‌చార్జ్ ఇంతియాజ్ బాషా
- మాజీ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- పాల్గొన్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



వైఎస్సార్ సర్కిల్‌కు పార్టీశ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా

కర్నూలు (టౌన్): ' నేను పుట్టింది ఇక్కడే..చదివింది ఇక్కడే. మీరు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా'నని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్, మాజీ కలెక్టర్ ఇంతియాజ్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాడేపల్లి నుంచి కర్నూలు నగరానికి చేరుకున్న ఆయనను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డితో కలిసి స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంతియాజ్‌బాషా మాట్లాడుతూ గ్రూపు -1 అధికారిగా ఐఏఎస్ హోదాలో కలెక్టర్‌గా పనిచేశానన్నారు. 30 ఏళ్లగా అన్ని విభాగాల్లో పనిచేసిన పాలనా అనుభవం తనకు ఉందన్నారు. రెండు రోజుల క్రితం తాను పదవికి రాజీనామ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరానన్నారు. ముఖ్యమంత్రి పాలన తనకు ఎంతో నచ్చిందని చెప్పారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డిల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన ఇంతియాజ్‌బాషాకు వ్యక్తిగతంగా, వారి కుటుంబానికి నగరంలో మంచి పేరు ఉందన్నారు. సెర్ప్ సీఈఓగా పనిచేసిన మాజీ కలెక్టర్ నవరత్నాలు అమలులో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. అందరం కలిసికట్టుగా ఆయనను గెలిపించుకుని మరోసారి కొండారెడ్డి బురుజు మీద వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మాట్లాడుతూ పరిపాలనలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఇంతియాజ్ బాషాను కర్నూలు ఎమ్మెల్యేగా ప్రకటించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. మాజీ ఐఏఎస్ గెలుపుతో నగరాభివృద్ధితో పాటు పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. అందరం ఆయనకు అండగా నిలబడాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అదనపు రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పాలకొలను జగనన్న కాలనీలో లేఅవుట్ వేయాలి



ఎమ్మెల్యే కాటసాని విన్నపాన్ని పరిశీలిస్తున్న జేసీ

కర్నూలు(సెంట్రల్) : ఓర్వకల్ మండలం పాలకొలనులో జగనన్న కాలనీ కోసం కేటాయించిన స్థలంలో లేఅవుట్ వెంటనే వేసేందుకు చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు సూచించారు. శుక్రవారం ఆయన గ్రామస్తులతో కలసి సమస్యను జేసీకి వినతిపత్రం రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ సుజాతమ్మ,సుధాకరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి లేఅవుట్ వేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. దాదాపు 320 మందికి అక్కడ స్థలాలు ఇవ్వడం కోసం ప్లాట్లు వేసినట్లు చెప్పారు. అయితే, ఆ ప్లాట్లను చదును చేసి తమ సొంత అవసరాల కోసం అక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారిని ఆగడాలకు అడ్డుకట్ట వేసి లబ్ధిదారులకు మళ్లీ లేఅవుట్‌ను వేసి ప్లాట్లు చూపించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కర్నూలు కల్చరల్: యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆర్‌యూ రసాయన శాస్త్ర విభాగంలో హైదరాబాద్ స్పైకింగ్ స్కిల్స్ వారిచే ఇండస్ట్రియల్ ట్రైనింగ్, అకడమిక్ ప్రాజెక్ట్స్ రసాయన శాస్త్రంలో ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులకు పరిమితం కాకుండా పారిశ్రామిక, పరిశోధన సంస్థలతో అనుసంధానం కావాలన్నారు. రసాయన శాస్త్రంలో అభ్యసించిన వారికి ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె. నాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న, స్పైకింగ్‌స్కిల్స్ సంస్థ ప్రతినిధులు వెంకటేష్, ప్రనవీణ్, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పు అడిగినందుకు హత్యాయత్నం

కర్నూలు : అప్పు చెల్లించమని అడిగినందుకు ఇద్దరి స్నేహితుల మధ్య గొడవ జరిగి హత్యాయత్నానికి దారితీసింది. కల్లూరులోని వక్కెర వాగు సమీపంలో నివాసం ఉంటున్న అలీ అనే వ్యక్తి ఎల్కూరు బంగ్లాలో నివాసం ఉంటున్న సతీష్ దగ్గర రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అలీ ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు ఇవ్వాల్సిన అప్పును చెల్లించాలని శుక్రవారం ఉదయం సతీష్ అలీ ఇంటికి వెళ్లి ఒత్తిడి చేశాడు. సాయంత్రం ఇస్తాను ఇంటి దగ్గరికి రమ్మని పిలిచి ఫుల్‌గా మద్యం సేవించి టెంకాయలు కొట్టే కత్తితో సతీష్‌పై మూడు చోట్ల పొడిచి కార్‌లో డోన్‌వైపు పారిపోతుండగా నాలుగో పట్టణ సీఐ శంకరయ్య సమాచారం తెలుసుకుని వెంబడించి బొమ్మిరెడ్డిపల్లె వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డికి కూడా స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గాయాలకు గురైన సతీష్‌ను అమీలియో ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. దాడికి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన అవసరం

కర్నూలు (టౌన్): ఈవీఎంల నిర్వహణతో పాటు పోలింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రతి పోలింగ్ అధికారులకు చెప్పారు. శుక్రవారం నగరపాలకలోని ఆయన చాంబర్‌లో పోలింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎలక్షన్ డీటీ ధనుంజయ పాల్గొన్నారు.

- ఎన్నికల వేళ సర్వేలయన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన వస్తువులను నిర్దేశించిన ఫార్మేట్‌లో నమోదు చేయాలని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ చెప్పారు.

పకడ్బందీగా పది పరీక్షలు

కర్నూలు కల్చరల్: పదోతరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ కె.శామ్యూల్ ఆదేశించారు. శుక్రవారం ఏ క్యాంప్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో పది పరీక్షల నిర్వహణపై పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండ్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు మార్గదర్శనం చేశారు. సమావేశంలో పరీక్షల పర్యవేక్షకురాలు, కేజీబీవీ జాయింట్ డైరెక్టర్ గీత, కర్నూలు డివిజన్ డిప్యూటీ ఈఓ హనుమంతరావ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తొలి రోజు 68.18శాతం పెన్షన్ పంపిణీ

కర్నూలు (టౌన్) : నగరంలో తొలిరోజే 68.18 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకే సచివాలయ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టారు. నగరపాలక సంస్థ పరిధిలో అన్నిరకాల పెన్షన్ దారులు 34,128 మంది ఉన్నారు. వీరికి ప్రతినెల పెన్షన్ల రూపంలో రూ.10,34,09,500 పంపిణీ చేయాల్సి ఉంది. మొదటి రోజు రూ. 7,41,04,500 అందజేశారు. ఈనెల 5 వ తేదీ లోపు వంద శాతం పెన్షన్ పంపిణీ చేస్తామని నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు.

సుందరయ్య జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరుతూ వాహనదారుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి

కర్నూలు : అక్రమ మద్యం, గంజాయి, ఆటోలో రవాణా చేస్తున్న వారి గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమతిలేని ల్యాబ్‌లను సీజ్ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ల్యాబ్‌లను వెంటనే సీజ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఏఓ అరుణకు శుక్రవారం ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, నగర అధ్యక్షులు బాబయ్య, మునిస్వామి తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘం ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయని పలు బ్రాహ్మణ సంఘాల నేతలు ఆరోపించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సండేల్ చంద్రశేఖర్, మారుతిశర్మ, కంచు గంటల శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ దొడ్డిదారిన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన కార్యవర్గాన్ని రద్దు చేయాలన్నారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మారుతిశర్మ, కొలుకుల చంద్రశేఖర్‌రావు, కృష్ణకాంత్, దార్వాడ ఆనందరావు, టి. రవిశర్మ, గౌరిపెడ్డి శేషు, మామిళ్లపల్లి రాజేష్, జేఏసీ కన్వీనర్ దేవి ప్రసాద్ పాల్గొన్నారు.

యూపీ వాసి అనుమానాస్పద మృతి

కర్నూలు : స్థానిక పూలబజార్‌లో నివాసం ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్ వాసి బిగేష్‌కుమార్‌శర్మ (44) అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈయన కొన్నేళ్లుగా లాంతర్ల వ్యాపారం, బేల్దారిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడటంతో ఆరోగ్యం బాగా క్షీణించింది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున భార్య రూపాశర్మ నిద్రలేపినప్పటికీ లేవకపోవడంతో వైద్య చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈయనకు ఇద్దరు కూతుళ్ల సంతానం. మృతుడి భార్య ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.